వీణవంకలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

మానకొండూర్: పోలీసులు, అధికారుల సమక్షంలోనే మాజీ జడ్పీటీసీ శేఖర్‌గౌడ్‌తో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకుడు కొత్తకొండ శంకర్, తదితరులు

రామడుగు: గోపాల్‌రావుపేట జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాశ్‌ను ప్రశ్నిస్తున్న యువకులు

గ్రామసభల్లో లొల్లిలొల్లి

రెండో రోజూ రసాభాసగా సమావేశాలు • జాబితాల్లో పేర్లు లేకపోవడంతో గ్రామస్తుల ఆగ్రహం

నాలుగు కొత్త పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో నిర్వహించిన గ్రామ సభలు బుధవారం రెండో రోజు సైతం గందరగోళంగా జరిగాయి. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాల కోసం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ పలువురు గ్రామస్తులు అధికారులను నిలదీశారు. తామెందుకు పథకాలకు అర్హులం కాదని ప్రశ్నించారు. ఈ సర్వే ఏ విధంగా చేశారని మండిపడ్డారు. దీంతో గ్రామసభలు రసాభాసగా మారాయి. జాబితాల్లో పేర్లు రాని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో ఇంకెన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

హుజూరాబాద్, జనవరి 22: మండలంలోని కనుకులగిద్ద గ్రామసభలో అర్హులను కాకుండా అనర్హులను పథకాలకు ఎంపిక చేశారంటూ పలువురు గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అనర్హులే ఉన్నారని, అర్హులకు అందించాలని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డుల కోసం ఎన్నిసార్లు దరఖాస్తులు ఇవ్వాలని నిలదీశారు.

హుజూరాబాద్ టౌన్, జనవరి 22: పట్టణంలోని 17వ వార్డు సభలో మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధిక ప్రసంగానికి కాంగ్రెస్ నాయకులు అడ్డుపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తరహాలో ఇప్పటి ప్రభుత్వం పథకాలను అమలు చేయాలని సూచిస్తుండగా.. ప్రసంగానికి అడ్డుపడ్డారు. దీంతో ప్రసంగాన్ని మధ్యలోనే ఆపి, అక్కడి నుంచి వెళ్లిపోయారు.

హుజూరాబాద్ రూరల్, జనవరి 22: మండలంలోని తుమ్మనపల్లి గ్రామసభ ప్రజలు లేక సభ వెలవెల బోయింది. రాంపూర్, సిర్సపల్లి, రాజపల్లి, జూపాక, కనుకులగిద్ద గ్రామాల్లో అర్హులైన వారి పేర్లు జాబితాల్లో రాలేదని పలువురు గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ప్రతి గ్రామంలో గ్రామస్తులు ఆందోళనలు చేపట్టారు. పోలీసులు రంగప్రవేశం చేయడంతో శాంతించారు.

అర్హులందరికీ పథకాలు అందేలా కృషిచేస్తాం: మేయర్

నగరంలోని 33వ డివిజన్ వార్డు సభలో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు

37వ డివిజన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్

కార్పొరేషన్, జనవరి 22: ప్రజాపాలన వార్డు సభల్లో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ప్రభుత్వానికి పంపి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. నగరంలో రెండో రోజు బుధవారం ఉదయం 15 డివిజన్లు, మధ్యాహ్నం 15 డివిజన్లలో వార్డు సభలు జరిగాయి. సభల్లో వివిధ పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల జాబితాను అధికారులు ప్రకటించారు. జాబితాల్లో పేర్లు లేకపోవడంతో అనేక మంది ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుతో పాటు, పలు డివిజన్లలో నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ వార్డు సభలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ పరిశీలనకు పంపిస్తామని తెలిపారు. కాగా, నగరంలోని 39వ డివిజన్‌లో కార్పొరేటర్ దరఖాస్తు పత్రాలను అందిస్తుండగా, వాటిని తీసుకునేందుకు ఒక్కసారిగా ప్రజలు పోటీ పడడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. పలు పత్రాలు చిగిరిపోయాయి. దీంతో పోలీసులు కలుగజేసుకొని దరఖాస్తు పత్రాలను అందించారు. అనేక ప్రాంతాల్లో దరఖాస్తు పత్రాల కోసం ప్రజలు జిరాక్స్ సెంటర్లకు వెళ్లడం కనిపించింది.

జమ్మికుంట టౌన్ (హుజూరాబాద్ టౌన్), జనవరి 22: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కోసం 380 మంది దరఖాస్తు చేసుకోగా, వార్డు సభలో మాత్రం 230 మంది పేర్లు మాత్రమే ప్రకటించడంపై ప్రజలు అధికారులను నిలదీశారు. 14వ వార్డు వార్డుసభలో అర్హులకు పథకాలు ఎందుకు అందించడం లేదని ప్రజలు ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆగ్రహంతో ఫ్లెక్సీని చింపి, మురుగుకాలువలో పడేశారు. కోరపల్లి గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అనర్హుల పేర్లను ప్రకటించారంటూ ప్రజలు, అధికారులతో వాగ్వాదానికి దిగారు. వారిని చుట్టుముట్టారు. పోలీసులు కలుగజేసుకొని, స్థానికులను అదుపు చేశారు.

సైదాపూర్, జనవరి 22: ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో పాల్గొన్నప్పటికీ జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేవని రాంచంద్రాపూర్ గ్రామసభలో ప్రజలు అధికారులను ప్రశ్నించారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న తమకు ఎలిజిబిలిటీ ఎందుకు లేదో చెప్పాలని రాయికల్‌లో ప్రజలు అధికారులను నిలదీశారు. భూమి లేని వారందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలని ప్రజలు కోరారు.

ఇల్లందకుంట, జనవరి 22: మండలంలోని చిన్నకోమటిపల్లి, సీతంపేట గ్రామాల్లో అధికారులు లబ్ధిదారుల జాబితాలను చదివి వినిపిస్తుండగా, అనర్హులను పథకాలకు ఎంపిక చేశారంటూ పలువురు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు అర్హత ఉన్నా తమను జాబితాలో చేర్చలేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జాబితాల్లో పేర్లు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో పుల్లయ్య సూచించారు.

వీణవంక, జనవరి 22: మండలంలోని మామిడాలపల్లి, వీణవంక, గంగారం, బొంతుపల్లి, నర్సింహులపల్లి, పోతిరెడ్డిపల్లి, లస్కర్కపల్లి, వల్భాపూర్, కోర్కళ్ గ్రామ సభల్లో అధికారులు నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించగా, ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ ప్రజలు ఆందోళన చేశారు. వీణవంకలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎంపికలో పూర్తిగా అన్యాయం జరిగిందంటూ మహిళలు పెద్ద ఎత్తున గొడవ చేశారు. ప్రతి గ్రామ సభలో అధికారులను నిలదీశారు.

మానకొండూర్, జనవరి 22: మానకొండూర్ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇందిరమ్మ ఇండ్ల కోసం మొత్తం 1734 మంది దరఖాస్తు చేసుకోగా, 826 మంది పేర్లు లిస్టులో పెట్టారు. ఇందులో సొంత జాగ ఉన్న లబ్ధిదారుల కేటగిరిలో 549, ఖాళీ స్థలం లేని వారి జాబితాలో 277 మంది ఉన్నారు. దీనిపై మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్ స్పందించి, ఇప్పుడు లిస్ట్ ఉన్న లబ్ధిదారులందరికీ ఇండ్లు మంజూరు అయినట్టేనా, స్పష్టత ఇవ్వాలని అధికారులను కోరారు. అంతలో అక్కడే గ్రామసభలో ఉన్న కాంగ్రెస్ నాయకుడు కొత్తకొండ శంకర్ కల్పించుకుని.. మీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఎన్ని ఇండ్లు ఇచ్చారో చెప్పాలని శేఖర్‌గౌడ్‌తో వాగ్వాదానికి దిగాడు. అలాగే, సంక్షేమ పథకాలను ఎవరికి ఇచ్చుకుంటామనేది తమ ఇష్టమని, అడుగడానికి మీరు ఎవరంటూ దుర్భషలాడుతూ అధికారులు, పోలీసుల సమక్షంలోనే రెచ్చిపోయాడు. ఇంతలో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు కోండ్ర సురేశ్, పిట్టల వెంకటేశ్, తాళ్లపెల్లి నరేశ్, ఇర్ఫాన్, తదితరులు బీఆర్ఎస్ నాయకులతో గొడవకు దిగారు. చివరకు అధికారులు, పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగింది.

మానకొండూర్ రూరల్, జనవరి 22: మానకొండూర్ మండలం రంగపేట గ్రామసభలో అనర్హులను జాబితాలో నమోదు చేశారని ఎంపీవో కిరణ్ కుమార్‌తో పాటు అధికారులను పలువురు గ్రామస్తులు నిలదీశారు. మళ్లీ సర్వే చేసి అనర్హుల పేర్లు తొలగిస్తామని అధికారులు చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

శంకరపట్నం, జనవరి 22: కేశవపట్నం, కన్నాపూర్, ధర్మారం, ఆముదాలపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పథకం, రేషన్ కార్డుల జాబితాల విషయమై అధికారులతో వాగ్వాదానికి దిగారు. కేశవపట్నంలో గొడిశాల రజిత-రాములు అనే దంపతులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో తమ పేరు లేకపోవడంతో తహసీల్దార్ భాస్కర్‌ను ప్రశ్నించారు. తమకు జాబ్ కార్డు ఉందని, 50 రోజుల పాటు ఉపాధి పనులకు సైతం వెళ్లామని తెలిపారు. ఆముదాలపల్లి గ్రామంలో తమకు స్థలం కలిగి జాబ్ కార్డు ఉన్నా, ఉపాధిహామీ పనులకు వెళ్తున్నా ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమ పేరు చేర్చలేదని శనిగరపు రాధ-ఓదయ్య అధికారులతో వాదనకు దిగారు. ధర్మారం గ్రామంలో అర్హులమైనా తమను ఆత్మీయ భరోసా పథకంలో చేర్చలేదని చొల్లేటి రాజయ్య, గోపి ఆవేదన వ్యక్తం చేశారు.

తిమ్మాపూర్ రూరల్, జనవరి 22: మండలంలోని వచ్చునూరు, నేదునూరు, కొత్తపల్లి, మన్నెంపల్లి, మల్లాపూర్, మొగిలిపాలెం, పర్లపల్లి గ్రామసభల్లో అర్హుల పేర్లు జాబితాలో లేవంటూ అధికారులను గ్రామస్తులు నిలదీశారు. లబ్ధిదారుల జాబితాను ఏ ప్రతిపాదికన ఎంపిక చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

గన్నేరువరం, జనవరి 22: గన్నేరువరం గ్రామసభలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబితాలో అర్హుల పేర్లు లేవని, కాంగ్రెస్ నాయకులకే పథకాలను కేటాయించారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పారువెల్ల గ్రామసభలో వెల్లడించిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాల్లో అర్హత ఉన్నప్పటికీ తమ పేర్లు ఎందుకు చేర్చలేదంటూ పలువురు గ్రామస్తులు అధికారులను నిలదీశారు.

చిగురుమామిడి, జనవరి 22: మండలంలోని గాగిరెడ్డిపల్లి, లంబాడిపల్లి, సీతారాంపూర్, ముదిమాణిక్యం, నవాబుపేట గ్రామాల్లో రెండో రోజు గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. కాగా, లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లు వచ్చాయని పలువురు గ్రామస్తులు ఆరోపించారు.

చొప్పదండి, జనవరి 22: వివిధ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు రాలేదని పలువురు గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించామని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఒక్క పోలింగ్ బూత్ పరిధిలో సుమారు పది ఇండ్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ గ్రామ సభల్లో ఏ ఒక్క దరఖాస్తుదారుడికి ఇల్లు మంజూరు చేయకపోవడంతో ప్రజలు నిరాశ పడుతున్నారు.

రామడుగు, జనవరి 22: గోపాల్‌రావుపేట గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాల్లో తమ పేరు ఎలా తొలగిస్తారని మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాశ్, ఎంపీవో శ్రవన్‌కుమార్‌పై పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఎంత మందికి అందించిందో చెప్పాలని నిలదీశారు.

అసౌకర్యాల మధ్య గ్రామసభలు

కరీంనగర్ రూరల్, జనవరి 22: మండలంలో బుధవారం జరిగిన గ్రామసభల్లో అసౌకర్యాలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. గోపాల్‌పూర్, చేగుర్తి, మందులపల్లి, జూబ్లినగర్, నల్లగుంటపల్లి, ఫకీర్‌పేట, తాహెర్ కొండాపూర్, బహ్దూర్‌ఖాన్‌పేట గ్రామసభలు జరుగగా, పలు చోట్ల కనీసం నీటి సౌకర్యం కల్పించకపోవడంతో పిల్లలతో వచ్చిన మహిళలు ఇక్కట్లపాలయ్యారు. ఇక సర్వేలో ఎంపికైన లబ్ధిదారుల పేర్లు నోటీస్ బోర్డులో పెట్టకపోవడం అనేక మంది అధికారులను ఆరా తీస్తూ కనిపించారు.

కళ్ల గంతలు కట్టుకొని నిరసన వ్యక్తంచేస్తున్న కార్పొరేటర్ ఎడ్ల సరితా అశోక్

ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై నిరసన

కార్పొరేషన్, జనవరి 22: తమ డివిజన్‌లో ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాల్లో అనేక మంది అర్హుల పేర్లు రాలేవంటూ 25వ డివిజన్ కార్పొరేటర్ ఎడ్ల సరితా అశోక్ బుధవారం తన నివాసంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అలాగే రేషన్‌కార్డుల విషయంలోనూ ప్రభుత్వం ఎలాంటి స్పష్టత లేకుండానే జాబితాను ప్రకటించిందన్నారు. అందుకే తాము గాంధీగిరి పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరారు.

మా పేర్లే తొలగించారు

నాకు ఇల్లు లేకపోవడంతో ప్రజాపాలనలో నా భార్య తిరుమల పేరిట దరఖాస్తు చేసుకున్న. మా గ్రామంలో ప్రజాపాలన గ్రామసభలో వెల్లడించిన లబ్ధిదారుల జాబితాలో మాతో పాటు అర్హత ఉన్న ఎంతో మంది పేర్లు గల్లంతయ్యాయి. అనర్హుల పేర్లు జాబితాలో వచ్చాయి. కావాలనే కొంత మంది పైరవీకారులు మా పేర్లను తొలగించారు. ఈ విషయం జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్తా.

-ఎర్ర శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి, రాంపూర్, హుజూరాబాద్ మండలం

దొడ్డు బియ్యం తింటలేరు..

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

తిమ్మాపూర్, జనవరి 22: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న దొడ్డు బియ్యం ఎవరు తినడం లేదని.. సగానికి పైగా లబ్ధిదారులు అమ్ముకుంటున్నారని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేసి.. సన్న బియ్యం పంపిణీ చేస్తామని హామీఇచ్చారు. రేణికుంటలో బుధవారం నిర్వహించిన గ్రామ సభకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కాగా, మంత్రుల పర్యటనలో నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా రేణికుంటలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలోని మహిళా పోలీస్ సిబ్బందితో సమావేశం వద్ద మోహరించారు.

నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా గుర్తిస్తాం

నారాయణపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గంగాధర, జనవరి 22 : గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌ను ముంపు గ్రామంగా గుర్తిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద నారాయణపూర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, మరో రూ.60 కోట్లు ఖర్చు చేస్తే 70 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రేషన్ కార్డు కావాలన్న వారికి తప్పకుండా ఇస్తామన్నారు. జాబితాలో పేర్లు లేనివారు ఆందోళన చెందొద్దని, గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇక్కడ అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రపుల్‌దేశాయ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఆర్డీవో మహేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘం భవనాన్ని ప్రారంభించిన మంత్రులు

గంగాధర మండలం కురిక్యాల వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సంఘం భవనాన్ని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. సహకార సంఘాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని మంత్రులు ఆకాంక్షించారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

గంగాధర మండలంలో బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. మాజీ సర్పంచ్ ఎండీ నజీర్, మాజీ ఎంపీటీసీ బాబు మల్లేశంతో పాటు మరి కొందరిని అరెస్టు చేసి, గంగాధర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తాము ఎలాంటి సమస్య సృష్టించబోమని, ఇంటి నుంచి బయటికి కూడా వెళ్లడం లేదని చెప్పినా వినకుండా బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారని నాయకులు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యానగర్, జనవరి 22: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కరీంనగర్ క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో రక్త హీనత, బీపీ, షుగర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ చెన్నమనేని రామ్మోహన్ రావు, లయన్ మేచినేని సత్యనారాయణరావు, ఆర్‌సీ లయన్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, లయన్ బోయినపల్లి నర్సింగరావు, లయన్ నడిపెల్లి ప్రసాద్ రావు, లయన్ యాదగిరి శేఖర్ రావు. జెడ్‌సీ లయన్ మేచినేని రామేశ్వర్ రావు, లయన్ మర్రిపెల్లి మహేందర్, కోశాధికారి లయన్ పచ్చునూరి సురేందర్, రీజియన్ సెక్రటరీ లయన్ కోట సత్యం, కరీంనగర్ క్లబ్ సెక్రటరీ గంప వెంకట్, క్లబ్ సభ్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

విద్యానగర్, జనవరి 22: జీజీహెచ్ ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బుధవారం ప్రభుత్వ ప్రధాన దవాఖానలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ బహుమతులు అందజేశారు. కొవిడ్ తర్వాత వైద్య ఆరోగ్యశాఖలో మొదటిసారిగా క్రీడా పోటీలు నిర్వహించినట్లు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ గుండా వీరారెడ్డి తెలిపారు. ఉద్యోగులకు రంగోలి, క్యారం, చెస్, టెన్నికాయిట్, క్రికెట్, షటిల్ తో పాటు ఫన్ గేమ్స్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ స్టాఫ్ పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో నవీనా, డిప్యూటీ సివిల్ సర్జన్ రవి ప్రకాష్ రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ హరికృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తికి డైరీ బహూకరణ

కొత్తపల్లి, జనవరి 22 : జిల్లా న్యాయమూర్తి బి ప్రతిమరెడ్డికి టీఎన్జీవో నాయకులు సంఘం డైరీని బహూకరించారు. బుధవారం కరీంనగర్‌లోని న్యాయమూర్తి చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి 2025 సంవత్సర డైరీని అందజేశారు. న్యాయమూర్తితో పాటు జ్యూడీషియల్ సిబ్బందికి అందించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, నాయకులు కిరణ్ కుమార్‌రెడ్డి, సర్దార్ హర్మీందర్ సింగ్, మారుపాక రాజేశ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయకపోతే ఊరూరా దండోరా

జమ్మికుంట టౌన్, (హుజూరాబాద్ టౌన్), జనవరి 22: దళితబంధు రెండో విడుత నిధులు విడుదల చేయకపోతే ఊరూరా దండోరా వేసి ప్రభుత్వాన్ని ఎండగడతామని దళితబంధు సాధన సమితి సభ్యులు హెచ్చరించారు. బుధవారం పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వానికి ఫిబ్రవరి 5వ తారీఖు వరకు డెడ్‌లైన్ విధించారు. కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలుగూరి సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

'గణతంత్ర భారత్ - జాగృత భారత్' పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా/ హౌసింగ్ బోర్డు కాలనీ, జనవరి 22 : 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'గణతంత్ర భారత్ - జాగృత భారత్' సెమినార్ వాల్ పోస్టర్‌ను శాతవాహన యూనివర్సిటీ, ఎస్సారార్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సెమినార్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేస్తారన్నారు. కార్యక్రమంలో జాగృతి ప్రతినిధులు పసుల చరణ్, బండారి శ్రీనివాస్ గౌడ్, సిద్ధంశెట్టి సాజన్, ఎంఏ రజీ, చుక్క శ్రీనివాస్, సత్తు సంతోష్, బొంకూరి మోహన్, రత్నాకర్, పవన్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జనవరి 22: నగరంలోని పలు ఫీడర్లలో ఏబీ స్విచ్‌ల పనులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడీఈ పీ శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సాయి బాలాజీ నగర్, సీతారాంపూర్, సూర్యనగర్, జగిత్యాల రోడ్డు, శుభం గార్డెన్, గౌడ్స్ కాలనీ, ద్వారకానగర్, కాళోజీ నగర్, ఆరెపల్లి రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

కార్పొరేషన్, జనవరి 22: అలుగునూరు చౌరస్తాలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని బుధవారం మేయర్ సునీల్ రావు పలువురు కార్పొరేటర్లు, అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, ఎదుల్ల రాజశేఖర్, ఐలేందర్ యాదవ్, సుధగోని మాధవీ కృష్ణగౌడ్, కోల మాలతీ సంపత్ రెడ్డి, స్థానిక నాయకులు మల్లారెడ్డి, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి లక్ష ఉత్తరాలు

వీణవంక, జనవరి 22: నర్సింగాపూర్ గ్రామంలో బుధవారం రాజ్యాంగ చైతన్య ఉద్యమంలో భాగంగా డీఎస్పీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి లక్ష ఉత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. దేశంలో 75వ గణతంత్ర వేడుకలు జరుపుకొంటున్న నేపథ్యంలో రిపబ్లిక్ డే రోజున జాతీయ జెండా వద్ద రాజ్యాంగ పుస్తకాన్ని, డా.బీ.ఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని, రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించాలని సీఎంకు ఉత్తరాలు పోస్టు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ మండలాధ్యక్షుడు సదానందం, నాయకులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాల చైర్మన్‌కు సన్మానం

శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డిని సన్మానిస్తున్న జేఎన్టీయూహెచ్ వైస్ చైర్మన్, తదితరులు

తిమ్మాపూర్ రూరల్, జనవరి 22: మండలంలోని శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డిని హైదరాబాద్ జేఎన్టీయూలో జరిగిన అంతర్జాతీయ లీడర్ షిప్ సమ్మిట్‌లో ఘనంగా సన్మానించారు. '